పొదుపు రుణాలపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండల కేంద్రంలో వెలుగు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం డ్వాక్రా సభ్యులు చెల్లిస్తున్న పొదుపు రుణాల చెల్లింపు లపై అవగాహన కల్పించేందుకుగాను మన డబ్బులు..మన లెక్కలు కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక వెలుగు కార్యాలయం నుంచి ప్రారంభించిన ర్యాలీ పెట్రోల్ బంక్ మీదుగా మూడు రోడ్ల జంక్షన్ వరకు సాగింది. ఈ సందర్భంగా ఏపీఎం పి.సుందరమ్మ మాట్లాడుతూ, డ్వాక్రా సంఘ సభ్యులు బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలు, పొదుపు డబ్బులను చెల్లించినప్పుడు ప్రతినెలా ఎంత డబ్బులు చెల్లించామనే దానిపై ఎప్పటికప్పుడు సమావేశం ఏర్పాటు చేసుకొని చర్చిం చుకోవాలని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో వెలుగు డిపిఎం, ఆ శాఖ సిబ్బంది, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ చేపడుతున్న సిబ్బంది

సిఐటియు మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి- హుకుంపేట: డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు జరిగే అఖిల భారత సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం మండల కమిటీ నాయకులు మండల కేంద్రంలో శుక్రవారం గోడపత్రికలు, పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల నాయకులు వి.లక్ష్మణరావు మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను నిర్వీర్యం చేస్తూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయని విమర్శించారు. ఇందులో భాగంగానే కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లు కార్మిక వ్యతిరేక విధానాలేనని పేర్కొన్నారు. ఈ లేబర్ కోడ్లను తక్షణమే కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా తీవ్రస్థాయిలో కార్మిక ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26,000 ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. స్కీమ్ వర్కర్లను, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, డైలీవేజ్ కార్మికులను వెంటనే రెగ్యులర్ చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్మికుల జీవన ప్రమాణాలను మెరుగుపర్చే దిశగా ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. మహాసభలను విజయవంతం చేసేందుకు మండలంలోని కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు హైమావతి, కె.రామారావు, జి.ఆనంద్, కౌసల్య, టి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నేతలు

ఎమ్‌డికి వినతిపత్రాన్ని ఇస్తున్న కార్మికులు

ఎపిఎఫ్‌డిసిని పరిరక్షించాలి

-సంస్థ ఎమ్‌డి శ్రీధర్‌కి కాఫీ కార్మికుల వినతి

ప్రజాశక్తి -పాడేరు : పాడేరు ఏజెన్సీలో కాఫీ తోటల పెంపకం నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి సంస్థను మరింత పటిష్టం చేసి పరిరక్షించాలని కాఫీ కార్మికులు, సిఐటియు నాయకులు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీధర్, ను కోరారు. శుక్రవారం ఈయన మండలంలోని మినుములూరు కాఫీ ఎస్టేట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కాఫీ కార్మిక సంఘం (సిఐటియు) ప్రతినిధులు ఎండి శ్రీధర్ తో భేటీ అయ్యారు. కార్మిక ప్రతినిధులు ఎల్.సుందర్రావు కార్మికులతో మాట్లాడిన ఆయన కూలీ రేట్లు, పండ్ల సేకరణ రేట్లు పెంచామని వెల్లడించారు. 2024 నవంబర్ లో జరిగిన చర్చల ఒప్పందం మేరకు సంస్థ ఎస్టేట్ ల పరిధిలో 35 మంది హెల్పర్స్ ను నియామకం చేయాలని కోరగా, సంస్థ రక్షణ కోసం కింద స్థాయి సిబ్బందిని నియమించడానికి సంసిద్ధంగా ఉన్నామని చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. సంస్థ రక్షణ కోసం తాము కట్టుబడి ఉన్నామని సిఐటియు ప్రతినిధులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ జ్యోతి, డివిజనల్ మేనేజర్ కృష్ణబాబు, రత్నదీపిక, అసిస్టెంట్ ఎస్టేట్ మేనేజర్లు, కార్మికులు వసంత కుమారి,వరలక్ష్మి, దేవి, పద్మ, లక్ష్మీ,మణి కార్మికులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు

ఎమ్మెల్యే శిరీషాదేవి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పనకు విశేష కృషి చేస్తున్నారని రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ మిరియాల శిరీష దేవి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ల్యాబ్, తరగతి గదుల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. పాఠశాల హెచ్ఎం ఎ.ఆదిలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, నూతనంగా మంజూరైన ల్యాబ్ తరగతి గదుల నిర్మాణం కొరకు సమగ్ర శిక్షా అభియాన్ నిధులు ద్వారా రూ.69.3 లక్షలు వ్యయం చేస్తున్నట్లు తెలిపారు. ఆయా నిర్మాణ పనులను సకాలంలో, పూర్తి నాణ్యతతో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇటీవల రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కలెక్టర్ ద్వారా ప్రశంసా పత్రం అందుకున్న పదో తరగతి విద్యార్థిని ఐనవిల్లి మౌళికకు ఎమ్మెల్యే చేతుల మీదుగా మరో ప్రశంసా పత్రం అందజేశారు. పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మాణం, మరుగుదొడ్లు కావాలని పాఠశాల సిబ్బంది, విద్యార్థులు వివరించగా వాటిపై ప్రత్యేక చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అనంతరం, స్థానిక శివాలయంలో భక్తుల సౌకర్యార్థం సుమారు రూ.10 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సీసీ రహదారిని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు, ఏఎంసీ చైర్మన్ లోతా లక్ష్మణరావు, ఎంపీపీ గోము వెంకటలక్ష్మి స్థానిక సర్పంచ్ గొల్లపూడి రమణి, ఎంపీటీసీలు కనిగిరి గంగాధర్, చప్ప చంద్రరాణి, సొసైటీ అధ్యక్షులు ముప్పన కేశవ్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మరిచెర్ల శ్రీనివాస్, మాజీ సొసైటీ అధ్యక్షులు గణజాల తాతారావ్, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి వాసంశెట్టి గంగాధర్, ఉపాధ్యక్షులు జెట్టి మధు శేఖర్, నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు ముప్పన సావిత్రి, తెలుగు యువత నాయకులు బారంగి అనుదీప్, ఎంపీటీసీలు నల్లా సత్తిబాబు, పలు శాఖల అధికారులు, కూటమి నాయకులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

రైతుల సంక్షేమమే సర్కారు లక్ష్యం

జిసిసి చైర్మన్ శ్రావణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి

ప్రజాశక్తి-పాడేరు: రాష్ట్రంలో రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని రాష్ట్ర జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి వెల్లడించారు. అల్లూరి జిల్లాలోని పాడేరు మండలం గుత్తులపుట్టు పంచాయతీలో 'రైతన్న మీకోసం' కార్యక్రమం టిడిపి ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతి రైతు ఆర్థికంగా ఎదగాలన్నదే కూటమి ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. రైతుల కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. 'రైతన్న మీకోసం' కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికి వెళ్లి పంటల ప్రయోజనాలు, రైతు ఆర్థిక అభివృద్ధికి చేయాల్సిన చర్యలను వివరించుతున్నామని చెప్పారు. రాష్ట్రంలో నీటి భద్రత కోసం ప్రాజెక్టుల్లో నీటిని నింపే కార్యక్రమాలను వేగవంతం చేశామని, డిమాండ్ ఆధారిత పంటలైన రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రల సాగుకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో భారీ పెట్టుబడులు రాబడుతున్నాయని, ఇప్పటికే సిఐఐ సదస్సులో 13 వేల కోట్ల పెట్టుబడులతో 38 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల కోసం ఎంఓయూలు కుదిరాయని చెప్పారు. 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈలను ఏర్పాటు చేసి వ్యవసాయ ఉత్పత్తుల విలువ పెంచే దిశగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. సూపర్ సిక్స్ హామీలను 17 నెలల్లో సూపర్ హిట్ చేసిన నాయకుడు చంద్రబాబేనని, తల్లికి వందనం, స్త్రీ శక్తి, ఉచిత బస్సు, దీపం, ఎన్టీఆర్ భరోసా పెన్షన్, 20 లక్షల ఉద్యోగాలు, మెగా డీఎస్సీ, అన్నదాత సుఖీభవ వంటి కార్యక్రమాలు వేగంగా అమల్లో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిసిసి డైరెక్టర్ బొర్రా నాగరాజు, విజయ రాణి, స్థానిక అధికారులతో పాటు సర్పంచులు, పార్టీ నాయకులు, మహిళలు, రైతులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చైర్మన్, మాజీ ఎమ్మెల్యే

కృష్ణారెడ్డికి సిపిఎం నేతల ఘన నివాళి

అంతిమ యాత్రకు తరలివచ్చిన జనసందోహం

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని కొటారిగుమ్మ గ్రామానికి చెందిన సిపిఎం సీనియర్ నాయకులు వాళ్ల కృష్ణారెడ్డికి సిపిఎం నాయకులు, ప్రజలు శుక్రవారం ఘనంగా నివాళు లర్పించారు. కృష్ణారెడ్డి (60) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ రామ్‌గోపాల్‌పురం ఆర్ అండ్ ఆర్ కాలనీలో గురువారం మృతి చెందిన విషయం విధితమే. కృష్ణారెడ్డికి భార్య ఇద్దరు కుమారులు జ్యోతిబస్ రెడ్డి, సుందరయ్య రెడ్డి ఉన్నారు. మరణ వార్త తెలుసుకున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సున్నం రాజులు, జిల్లా కమిటీ సభ్యులు సోయం చిన్నబాబు, మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్‌తో పాటు సిపిఎం బృందం శుక్రవారం కృష్ణారెడ్డి స్వగ్రామం కొటారి గుమ్మ గ్రామానికి వెళ్లి కృష్ణారెడ్డి మృతదేహంపై సిపిఎం జెండా కప్పి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా సున్నం రాజులు మాట్లాడుతూ చిన్న వయసులోనే యువజన ఉద్యమానికి నాయకత్వం వహించిన కృష్ణారెడ్డి తరువాత వ్యవసాయ కార్మిక సంఘం, ఇతర ప్రజా సంఘాల బలోపేతానికి కృషి చేశారని తెలిపారు. తునికాకు, భూ పోరాటంలో కీలక పాత్ర పోషించారని, పోలవరం వ్యతిరేకంగా ఉద్యమంలో భాగంగా ఐఏఎస్ అధికారులను గ్రామంలో నిర్బంధించి పోరాటం చేశారని, ఆ సమయంలో జైలు జీవితం గడిపారని గుర్తు చేశారు. కృష్ణారెడ్డి మరణం మండలంలో పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. కృష్ణారెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళ్తామన్నారు. అనంతరం జరిగిన అంతిమ యాత్ర శబరి గోదావరి సంగ్రమం ఒడ్డు వరకు భారీ జన సందోహం మధ్య సాగింది. అన్ని గ్రామాల నుండి సిపిఎం కార్యకర్తలు, బంధువులు, ప్రజలు తరలివచ్చి అంతిమ యాత్రలో పాల్గొన్నారు. జోహార్ కృష్ణారెడ్డి అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు పంకు సత్తిబాబు, కారం సుందరయ్య, పోడియం శ్రీరామ్మూర్తి, మండల కమిటీ సభ్యులు వడ్లది రమేష్, తోవడం రాజు, తాతబాబు, పండ వెంకటేశ్వర్లు, కొండారెడ్డి, కారం సత్తిబాబు, ఖాదర్, ప్రకాష్‌రావు, ఆత్మకూర్ కాంతారావు, ఎన్.రాజు, సోడి మల్లయ్య, పూనెం కిరణ్, సీనియర్ నాయకులు వీర్ల నాగేశ్వరరావు, యుటిఎఫ్ నాయకులు సోడి నాగేశ్వరరావు, ఎంపిటీసీ వాళ్ల వెంకటేశ్వరరెడ్డి, ఏఎస్‌డిఎస్ సిబ్బంది, బంధువులు, పలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వాళ్ల కృష్ణారెడ్డి మృతదేహంపై సిపిఎం జెండాను కప్పుతున్న సంతోష్‌కుమార్, రాజులు, చిన్నబాబు తదితరులు

విహారంలో విషాదం

-రోడ్డు ప్రమాదంలో తపాలా ఉద్యోగి మృతి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: స్నేహితుడు వచ్చాడనే ఆనందంతో పర్యాటక కేంద్రాల సందర్శనకు వెళ్లి తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదానికి గురై తపాలా ఉద్యోగి మృతి చెందిన విషాదకర సంఘటన చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానిక ఎస్సై పాపినాయుడు తెలిపిన వివరాలు. ప్రకాశం జిల్లా మార్కాపురం గ్రామానికి చెందిన షేక్ మహ్మద్ జుబేర్(21) అరకులోయ మండలం చొంపి పంచాయతీలో తపాలాశాఖలో సహాయ బ్రాంచి మాస్టారుగా విధులు చేపడుతున్నారన్నారు. గురువారం సాయంత్రం అంజోడ సిల్క్ ఫాం పీనరిలో తిలకించేందుకు తన స్నేహితుడు కిరణ్, తోటి ఉద్యోగితో కలిసి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో రాత్రి కావడంతో అరుకు సంత బయలు పంచాయతీ కేంద్రంలోని ఓ రెస్టారెంటులో భోజనం చేశారన్నారు. అక్కడి నుంచి అరకు లోయకు వెళ్తుండగా జాతీయ రహదారిలోని డివైడర్‌ను బలంగా ఢీ కొట్టారని చెప్పారు. ఈ ప్రమాదంలో జుబేర్ అక్కడ్కిడే మృతి చెందగా, ఇద్దరు గాయాలతో ఉండగా స్థానికులు అరకులోయ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారన్నారు. ఇద్దరి క్షతగాత్రుల్లో సారన్ కుమార్ పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారని అన్నారు. మృతదేహానికి శవ పంచానామ నిర్వహించి బాధిత కుటుంబీకులకు అప్పగించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

జుబేర్ (ఫైల్ ఫొటో)

వినతులను సత్వరం పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్
- పిజిఆర్ఎస్‌కు 112 అర్జీలు

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, పిఒ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఐటిడిఎలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థకు 112 వినతులు వచ్చాయి. జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్, ఐటిడిఎ పిఒ శ్రీ పూజ, అసిస్టెంట్ కలెక్టర్ కె సాహిత్, ఇంచార్జ్ ఆర్‌డిఒ ఎస్ విఎస్ లోకేశ్వరరావు సంయుక్తంగా వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులు స్వీకరించారు. స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత శాఖాధికారులకు అందించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ కు వచ్చిన సమస్యలు పరిష్కరించడానికి జిల్లా అధికారుల స్థాయిలో ఒక కమిటీ ఏర్పాటు చేసి నివేదించాలన్నారు.

స్వీకరించిన ఫిర్యాదులు కొన్ని..

కొయ్యూరు మండలం రామాపురంకు చెందిన కింజేటి లక్ష్మి తమకు ఉన్న మూడు ఎకరాల భూమిని ఆక్రమణదారుల చెర నుండి విడిపించాలని విన్నవించారు. చింతపల్లి మండలం చవటపు గ్రామస్తులు కె.నాగేశ్వరరావు, మంగు, రాములు సింహాచలం గ్రామంలో వాగుపై బ్రిడ్జి నిర్మించాలని అర్జీ సమర్పించారు. డుంబ్రిగుడ మండలం కొర్ర గ్రామస్తులు బాలరాజు, కృష్ణ, సుధలు సదానందం గ్రామంలో తాగునీరు సరఫరా చేయాలని, సిసి రోడ్లు, డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని, కొత్తగా నిర్మించిన అంగన్వాడీ కేంద్ర భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. హుకుంపేట మండలం అండిభ గ్రామ సర్పంచ్ తామర్ల సత్యనారాయణ అండిభ గ్రామం నుండి రామచంద్రాపురం వరకు బిటి రోడ్డు మొంథా తుఫాన్ కారణంగా ధ్వంసమైందని మరమ్మత్తులకు నిధులు మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ డిఎ పిడి వి.మురళి, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ బిఎస్ నంద్, జిల్లా ఖజానా లెక్కల శాఖ అధికారి ఆర్ ప్రసాద్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి జగన్మోహనరావు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఆర్‌వి.రమణరావు, జిల్లా సర్వే, భూ రికార్డుల అధికారి దేవేంద్రుడు, పలు మండలాల తహసీల్దార్ లు, ఎంపిడిఒలు, పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-సీలేరు : చింతపల్లి ఎఎస్‌పి నవజ్యోతి మిశ్రా ఆధ్వర్యంలో మైత్రి మూవీ మేకర్స్, జిల్లా పోలీసు శాఖ సంయుక్తంగా జీకే వీధి మండలం సీలేరులో శుక్రవారం నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరాన్ని ప్రముఖ సినీ నటుడు సాయికుమార్, సినీ దర్శకుడు శివ నర్వాణ్, ఏపీ జెన్కో ఎస్ఈ సివిల్ చంద్రశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. సుమారు 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. స్థానిక రామాలయం సెంటర్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో జిల్లా ఎన్‌డిఎ, సిడి ప్రోగ్రాం అధికారి డాక్టర్ పి.నారాయణ రావు, జిల్లా సికిల్ సెల్ ఎనీమియా ప్రోగ్రామ్ అధికారి కొట్ని బాబ్జి, దంత వైద్యులు చంద్రశేఖర్, కంటి వైద్య నిపుణులు జి.శృతి, చిన్నపిల్లల వైద్య నిపుణులు మణికంఠ, స్థానిక హోమియో వైద్యాధికారిణి సృజనా రాయ్ తదితరులు వైద్య సేవలు అందించారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

ఈ సందర్భంగా సినీ నటుడు సాయికుమార్, సినీ దర్శకుడు శివనర్వాణ్ మాట్లాడుతూ విద్యార్థులు మత్తుపదార్థాలకు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి మహమ్మారి జోలికి వెళ్లి నిండు జీవితాలు పాడు చేసుకోవద్దని హితవు పలికారు. అనంతరం మెడికల్ క్యాంపుకు వచ్చిన ప్రజలకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జీకే వీధి సిఐ సుధాకర్, ఎస్సై యాసిన్, ఏఈఈ సిహెచ్ సురేష్, స్థానిక సర్పంచి పాంగి దుర్గో, ఎంపీటీసీ పిల్లా సాంబమూర్తి, హెల్త్ సూపర్వైజర్ త్రినాధ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సాయికుమార్ రాకతో సందడి

సీలేరు : జీకే వీధి మండలం సీలేరుకు సినీ నటుడు సాయికుమార్ రాకతో సందడి వాతావరణం నెలకొంది. గత కొన్ని రోజులుగా సీలేరులో మైత్రి మూవీ మేకర్స్ శివనిర్వాణ్ దర్శకత్వంలో రవితేజ హీరోగా సినిమా షూటింగ్ జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ షూటింగ్‌లో పాల్గొనడానికి సాయికుమార్ సీలేరుకు గురువారం రాత్రి చేరుకున్నారు. శుక్రవారం ఉదయం మెగా వైద్య శిబిరం ప్రారంభానికి రాగా, ఆయన్ను చూసేందుకు అభిమానులు ఎగబడ్డారు. ఆయనతో ఫోటోలు దిగారు. అభిమానులు, విద్యార్థుల కోరిక మేరకు సాయికుమార్ సినిమా డైలాగులు చెప్పడంతో కేరింతలు కొట్టారు.

వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సినీ నటుడు సాయికుమార్

వైద్య సేవలు అందిస్తున్న దృశ్యం

లైసెన్స్ లేకుండా కాఫీ కొనుగోలు చేస్తే చర్యలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ప్రభుత్వం నుంచి లైసెన్సు ఉండకుండా కాఫీ కొనుగోలు చేస్తే అటువంటి వారిపై చర్యలు తప్పవని స్థానిక కాఫీ ఉద్యానవన శాఖ అధికారి శెట్టి మత్స్యరాజు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం వారపు సంతల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాఫీ బెర్రీ బోరర్ పురుగు ఉధృతిని అరికట్టడానికి జిల్లా కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ అదేశాల మేరకు కాఫీ కొనుగోలుదారులు తప్పని సరిగా ట్రేడ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ సంబధిత జిల్లా అధికారుల నుండి తీసుకోని వారీ ఆదేశాలను పాటిస్తూ తగు జాగ్రత్తలు తీసుకొని మాత్రమే కాఫీ కొనుగోలు జరపాలన్నారు. లైసెన్స్ లేకుండా కొనుగోలు జరపారాదని అరకు వారపు సంతలో వ్యాపారస్తులకు వివరించి అవగాహన కల్పించడం జరిగిందన్నారు. కాఫీ లైజన్ వర్కర్లు కరపత్రాలు ఇస్తూ లైసెన్సుకు ఏ మేమీ ఉండాలి, ఎలా అప్లై చేసుకోవాలనే దానిపై కూడా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కాఫీ లైజన్ వర్కర్లు జి.లక్ష్మీనారాయణ, శివ, గోపీనాథ్, స్వామి నాయుడు, రామారావు పాల్గొన్నారు.

తూనిక కాటాలను తనిఖీ చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి

ఉద్యోగ విరమణ మరియు షష్ఠిపూర్తి శుభాకాంక్షలు

అతి తక్కువ ధరతో మీ ప్రకటన వేయబడును.

మీ సేవలు మరువలేనివి, మీరెక్కడున్నా మీ శ్రేయస్సును కోరుకుంటాం, అందించండి. ప్రజాశక్తి ద్వారా శుభాకాంక్షలు

మీ సహోద్యోగులు, మీ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులలో ఎవరైనా రిటైర్ అవుతున్నారా? మరియు షష్ఠిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు తెలపాలనుకుంటున్నారా? అయితే అందించండి వారికి అభినందన కుసుమాలు, ఆకాంక్షించండి వారి సుఖమయ జీవితాన్ని ప్రజాశక్తి ద్వారా తెలియజేయండి.

ఉద్యోగ విరమణ

షష్ఠిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు

మరిన్ని వివరాలకు మా స్థానిక ప్రతినిధులను సంప్రదించండి

సిటీ	: 9490099125	పూర్ణమార్కెట్	: 9490099676
మధురవాడ	: 8008596645	జగదాంబ	: 9490099434
గాజువాక	: 9849392359	జివియంసి	: 9490099483
అనకాపల్లి	: 8008736188	ద్వారకానగర్	: 9490099672
చోడవరం	: 9490099141	కంచరపాలెం	: 9490099135
నర్సీపట్నం	: 9440280411	మాదవధార	: 9490099675
పాడేరు	: 9490099142		
రంపచోడవరం	: 9440165617		

పాఠశాలలో పిక్నిక్ సందడి

ఆటలు ఆడుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి-హుకుంపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పిక్నిక్ ఉత్సాహ భరితంగా, ఆనందోత్సవ వాతావరణంలో సాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీరావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, విద్యతో పాటు ఆహ్లాదకరమైన ఆటపాటలు, విహార యాత్రలతో విద్యార్థుల మానసిక వికాసానికి ఎంతగానో దోహదపడతాయని ఆయన తెలిపారు. పాఠ్యపుస్తకాలతో చదువుకే పరిమితం కాకుండా ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడంతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని తెలిపారు. మనసు ప్రశాంతంగా, రిలీఫ్‌నెస్‌గా ఉండి చదువుపై మరింత ఆసక్తి కలుగుతుందని వివరించారు. ఆరోగ్యకరమైన మనస్సుతోనే విద్యలో మెరుగైన ఫలితాలు సాధించగలమని ఆయన అన్నారు. విద్యార్థులు వివిధ ఆటలు ఆడుతూ, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొంటూ హుషారుగా గడిపారు.

వ్యాపారులపై కేసు నమోదు

తూనిక యంత్రాలను పరిశీలిస్తున్న రామచంద్రయ్య

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: తూనిక యంత్రాల్లో తేడాలు, వస్తు విక్రయాల్లో అధిక ధరలకు విక్రయిస్తున్న అయిదుగురు వ్యాపారులపై కేసులు నమోదు చేయడం జరిగిందని లీగల్ మెట్రోలాజి అనకాపల్లి అసిస్టెంటు కంట్రోలర్ రామచంద్రయ్య తెలిపారు. అరుకు సంతబయలు కేంద్రంగా శుక్రవారం జరిగిన సంతలో డిప్యూటీ కంట్రోలర్ రవికుమార్ ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టారు. ఎలక్ట్రానిక్ తూనిక యంత్రాలు సకాలంలో లేనివి, తూకాల్లో తేడాలు ఉన్న వాటిపై క్షుణంగా తనిఖీలు చేపట్టడం జరిగిందన్నారు. తూకాల్లో మోసాలు జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యాపారస్తులు తూనిక యంత్రాలు సరి చేసుకోవాలని, లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఆ శాఖ అధికారులు కొండారెడ్డి, రామారావు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: అరకులోయ ఏరియా ఆసుపత్రిలో వైద్య సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఐద్వా జిల్లా నాయకురాలు వివి జయ ప్రభుత్వంను కోరారు. అరకులోయలోని శుక్రవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ప్రతి శుక్రవారం సంత రోజు కావడంతో దూర ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో ప్రజలు అరకులోయకు వస్తుంటారని తెలిపారు. ఈ నేపథ్యంలో అనారోగ్యంతో బాధ పడుతున్న మహిళలు, గర్భిణీలు, చిన్నపిల్లలు, ఎముకల సంబంధిత సమస్యలు, వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్న వారు ఎక్కువగా శుక్రవారం ఏరియా ఆసుపత్రిని ఆశ్రయిస్తారని ఆమె పేర్కొన్నారు.

ప్రజలు సుమారు 20 నుండి 35 కిలోమీటర్ల దూరం ప్రయాణించి ఆసుపత్రికి చేరుతున్న నేపథ్యంలో, సంబంధిత విభాగానికి చెందిన వైద్యులు అందుబాటులో గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని అన్ని రకాల వ్యాధులకు సంబంధించిన వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేయాలని ఐద్వా మహిళ సంఘం డిమాండ్ చేస్తుందని తెలిపారు. ఆసుపత్రిలో మందులు, సిబ్బంది కొరత ఎప్పుడూ రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వానికి ఆమె విజ్ఞప్తి చేశారు.

ముగిసిన శిక్షణా శిబిరం

శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి-చింతపల్లి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వెబ్ డెవలప్మెంట్ విత్ పేజెస్ అంశంపై నిర్వహించిన సర్టిఫికేట్ కోర్స్ శిక్షణా కార్యక్రమం శుక్రవారం విజయవంతంగా ముగిసింది. ఈ కోర్సులో సుమారు 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. రిసోర్స్ పర్సన్ జి.వెంకటేష్ ఆధ్వర్యంలో గడచిన ఐదు రోజులుగా శిక్షణ కొనసాగింది. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయభారతి మాట్లాడుతూ, విద్యార్థులు కంప్యూటర్ జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకున్నందుకు అభినందించారు. శిక్షణ పొందిన విద్యార్థులు భవిష్యత్తులో ఉపాధ్యాయులుగా మారి ఇతరులకు కూడా శిక్షణ అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ పీఎం ఉష, కేజియా, రవీంద్రనాయక్, జగదీష్ బాబు, పూర్ణారావు, జగత్‌రాయ్ పాల్గొన్నారు.

జూపార్కుకు కొత్త నేస్తాలు

ప్రజాశక్తి - ఆరిలోవ: ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాలకు కొత్త నేస్తాలు వచ్చాయి. విశాఖ జూ పార్కు. జార్ఖండ్, రాంచీ జిల్లాలోని బిర్సా బయోలాజికల్ పార్కు మధ్య జరిగిన జంతు మార్పిడి విధానం ద్వారా ఇక్కడకు హిమాలయన్ బ్లాక్ బేర్, ఘరియాల్, స్పాటెడ్ డౌవ్, సిల్వర్ ఫీజెంట్ చేరుకున్నాయి. అదేవిధంగా ఇక్కడ నుంచి ఆసియాటిక్ వైల్డ్ డాగ్, బెంగాల్ మానిటర్ లిజర్డ్, బ్లాక్ స్వాన్, వైల్డ్ బోర్, బార్న్ అవుల్, గ్రే పెలికాన్, అలెగ్జాండ్రిన్ పారకీట్ ప్రతిగా భగవాన్ బిర్సా బయోలాజికల్ పార్క్‌కు పంపించారు. ఇప్పటికే ఇందిరాగాంధీ జూ పార్కులో ఒక మగ హిమాలయన్ బ్లాక్ బేర్ ఉందని, తాజాగా వచ్చిన ఒక మగ, ఒక ఆడ హిమాలయన్ బ్లాక్ బేర్‌లు ద్వారా ఇప్పుడు ఒక జంట ఏర్పాటుకు అవకాశం ఉందని జూ క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. అదేవిధంగా స్పాటెడ్ డౌవ్, ఘరియాల్, సిల్వర్ ఫీజెంట్‌ల సేకరణ ద్వారా మరింత సంతతి వృద్ధి చేస్తాయని, దీనిద్వారా సందర్శకులకు ఆకర్షణ పెరుగుతుందని ఆశాభావం వ్యక్త చేసారు. కొత్తగా వచ్చిన జంతువులను ప్రొటోకాల్ ప్రకారం క్వారంటైల్ వ్యవధి ముగిసిన తరువాత సందర్శకులు చూసేందుకు సంబంధిత ఎన్‌క్లోజర్లలో విడుదల చేయనున్నట్టు తెలిపారు.

విశాఖలోని జూపార్కుకు వచ్చిన కొత్త జంతువులు, పక్షులు

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

జిల్లా మలేరియా అధికారి డాక్టర్ తులసి

పరిశీలిస్తున్న తులసి

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు మండలం కేంద్రం పరిధిలోని పాత కుమ్మరిపుట్, ప్రభుత్వ బాలికల ఆశ్రమ ఇంగ్లీష్ పాఠశాలను అల్లూరి జిల్లా మలేరియా అధికారి ఎం. తులసి శుక్రవారం సందర్శించారు. ఫ్రై డే - డ్రై డే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె కుమ్మరిపుట్టు గ్రామంలోని డ్రైనేజ్ కాలువలను, ప్రతి ఇంటిని పరిసరాలను పరిశీలించారు. ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, డ్రైనేజ్ ఎప్పటికప్పటికీ శుభ్రపరచుకోవాలని ఆమె గ్రామస్తులకు సూచించారు. గ్రామంలో దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులు వ్యాపించకుండా గ్రామస్తులు తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ గిరిజన బాలికల ఇంగ్లీష్ మీడియం పాఠశాలను సందర్శించారు. చికెన్‌గున్యా, మలేరియా, డెంగ్యూ పై అవగాహన కల్పిస్తూ ఈ వ్యాధులు రాకుండా ఉండాలంటే దోమల కాటు నుండి రక్షణ పొందాలన్నారు. దోమలు పెరగకుండా, వ్యాప్తి చెందకుండా అరికట్టడానికి ఇంటి పరిసరాలను, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రస్తుతం పాడేరు ఏజెన్సీలో రెండు రకాల మలేరియా వ్యాధులు వ్యాపిస్తున్నాయని, పిఎఫ్ మలేరియా వస్తే మూడు రోజులు మందులు వాడాలని, పివి మలేరియా వస్తే 14 రోజులు మందులు వాడాల్సి ఉంటుందన్నారు. దోమతెరలు వాడాలని, త్వరలోనే ప్రభుత్వ హాస్టళ్లకు దోమతెరలు సరఫరా చేస్తామన్నారు. మలేరియా వ్యాధి సోకితే మూఢనమ్మకాలను ఆశ్రయించకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లో పరీక్షలు చేయించుకొని మందులను వాడాలని ఆమె విద్యార్థిలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కన్సల్టెంట్ శ్రీనివాసరావు, సబ్ యూనిట్ అధికారి ధనుంజయ్, ఎంపిహెచ్ఈఓ ప్రభాకర్‌రావు, హెల్త్ సిబ్బంది శెట్టి నాగరాజు, ఎం.వి.వి..ఎస్ కుమారి, సిహెచ్ఓ సంధ్య పాల్గొన్నారు.

డ్రైయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన

శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ త్రినాథ్

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలోని లక్ష్మీపురం గ్రామ పంచాయతీ పరిధిలోని సంగంవలస గ్రామంలో 100 మీటర్ల డ్రైనేజీ నిర్మాణంకు శుక్రవారం స్థానిక సిపిఎం సర్పంచ్ కొర్ర త్రినాథ్ భూమి పూజలు చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, సంగంవలస గ్రామంలో డ్రైనేజీ లేక అస్తవ్యస్తమైన రహదారిలో నీరు నిల్వ ఉండి బురదగా మారుతుందన్నారు. ఈ సమస్యను గుర్తించి మొదటి ప్రాధాన్యతగా నిధులు కేటాయించి పనులు చేపట్టామన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో వంద మీటర్ల డ్రైనేజీ నిర్మాణానికి రూ.ఐదు లక్షలు పంచాయితీ పాలక వర్గం ఆమోదంతో కేటాయించారు. మిగిలిన గ్రామాల్లో డ్రైనేజీ, సిసి రోడ్డు సమస్యలను దపాల వారీగా పరిష్కారం చేయడాకి కృషి చేస్తామని తెలిపారు. పంచాయితీ అభివృద్ధిఅధికారి గలీత్, ఎంపీటీసీ వి.సాధురాం, ఉప సర్పంచ్ ఎ.సత్యం, ఆర్.కృష్ణ, వార్డు సభ్యులు ఎ.అనంతరం, గ్రామస్థులు వి. సైబో, రూప్నా, వాసుదేవ్, మోడ్నో పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ఎన్నికైన నూతన సభ్యులు

ప్రజాశక్తి- చింతపల్లి: మండలంలో ఏపీ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం యూనిట్ ఎన్నికలు శుక్రవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. ఎన్నికల అధికారి ఆర్.వి. నాగరాజు పర్యవేక్షణలో నిబంధనలకు అనుగుణంగా ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా పూర్తయిందని ఆయన తెలిపారు. నూతన కమిటీ ప్రెసిడెంట్‌గా ఎస్.జె.జె. ఇమ్మానియేల్, వైస్ ప్రెసిడెంట్‌గా పాండురంగ, సెక్రటరీగా జి.ఎన్.వి.ఎస్.ఎన్. పడాల్, జాయింట్ సెక్రటరీగా కె. పావని, ట్రెజరర్‌గా వి.లక్ష్మణరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా టీ. వెంకటలక్ష్మి, శేషగిరి ఎన్నికయ్యారు. ఎన్నికల అనంతరం ఉమ్మడి విశాఖ జిల్లా ప్రెసిడెంట్ ఎస్.సత్తిబాబు, జీకే వీధి ఎంపీడీవో రమణబాబు, చింతపల్లి ఎంపీడీవో సీతామహాలక్ష్మి నూతన కమిటీ సభ్యులను అభినందించారు. నూతన కమిటీ ప్రెసిడెంట్ ఎస్.జె.జె. ఇమ్మానియేల్ మాట్లాడుతూ, ఉద్యోగుల సమస్యలను వేగంగా పరిష్కరించడం కమిటీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వంతో సమన్వయం చేస్తూ ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉంటామని, సంక్షేమ కార్యక్రమాల అమలు, పాలనా వ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.

గంజాయిపై డ్రోన్లతో సర్వే

సర్వేను పరిశీలిస్తున్న ఎస్పి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ఏజెన్సీలో గంజాయి సాగు నిర్మూలనకు ప్రభుత్వం డ్రోన్లతో సర్వే నిర్వహిస్తుంది. ఇందులో భాగంగా శుక్రవారం మండలంలోని అరమ పంచాయతీ అరమ, పరిడి జాకర వలస గ్రామాల్లో స్థానిక ఎస్సై కేపీ నాయుడు ఆధ్వర్యంలో డ్రోన్లతో సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అటవీ, వ్యవసాయ శాఖ, టిడబ్ల్యూ, పంచాయతీరాజ్, ఈగిల్ శాఖ అధికారులతో సమన్వయంగా ఫీల్ సర్వే నిర్వహించడం జరిగిందని ఎస్ఐ తెలిపారు.

కెజిహెచ్‌లో 'మెమొరీ క్లినిక్' ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్ న్యూరాలజీ విభాగం ఆధ్వర్యంలో ఈసాయి ఫార్మా సౌజన్యంతో డిపార్ట్మెంట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 'మెమొరీ క్లినిక్' శుక్రవారం ప్రారంభమైంది. జ్ఞాపకశక్తి మందగించడం, మతిమరుపు (డిమెన్షియా), అల్జీమర్స్ వంటి మెదడు సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారికి మెరుగైన వైద్య సేవలు, సలహాలు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక క్లినిక్‌ను కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కెవిఎస్ఎం.సంధ్యా దేవి ముఖ్య అతిథులుగా విచ్చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వాణి మాట్లాడుతూ వృద్ధాప్యంలో వచ్చే జ్ఞాపకశక్తి సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఈ మెమొరీ క్లినిక్ పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సంధ్యా దేవి మాట్లాడుతూ న్యూరాలజీ విభాగం అధిపతి డాక్టర్ ఎస్.గోపి నేతృత్వంలో ఈ క్లినిక్ మెదడు ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషించగలదని అన్నారు. కార్యక్రమంలో కెజిహెచ్ అడ్మినిస్ట్రేటర్ బివి.రమణ, సిఎస్ఆర్ఎంఓ డాక్టర్ యు.శ్రీహరి, ఆర్ఎంఓ డాక్టర్ రాజేష్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ బి.కిరణ్ కుమార్, న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎస్.గోపి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.సతీష్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ సిహెచ్.సుష్మ, డాక్టర్ కె.మనోజ్ కుమార్, న్యూరాలజీ పోస్ట్ గ్రాడ్యుయేట్లు పాల్గొన్నారు. ఈ క్లినిక్ ఏర్పాటుకు సహకరించిన ఈసాయి ఫార్మా ప్రతినిధులు గిరీష్, జోసెఫ్, జగదీష్ కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. కెజిహెచ్ న్యూరాలజీ విభాగం వైద్యులు వారంలో నిర్దిష్ట రోజుల్లో ఈ క్లినిక్‌లో సేవలు అందిస్తారు. జ్ఞాపక శక్తి సమస్యలు ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వాణి కోరారు. ఈ సందర్భంగా ఈసాయి ఫార్మా సంస్థ వారిని అభినందించారు.

న్యూరాలజీకి ఇఎంజి యంత్రం అందజేత

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆంధ్ర వైద్య కళాశాల పరిధిలోని కింగ్ జార్జ్ హాస్పిటల్ న్యూరాలజీ విభాగంలో రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు రూ.15 లక్షల విలువైన ఎంపీ లాడ్స్ నిధుల నుండి సమకూర్చిన ఇఎంజి (ఎలక్ట్రోమయోగ్రఫీ) యంత్రాన్ని శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ అత్యాధునికమైన ఇఎంజి యంత్రం ద్వారా నాడీ కండరాల సంబంధిత వ్యాధులకు సంబంధించిన నాడీ కండరాల వ్యవస్థ, జిబి.సింద్రోమ్, మస్క్యులర్ డిస్ట్రోఫీ రోగ నిర్ధారణ మరింత మెరుగవుతుందని, తద్వారా విశాఖపట్నం, పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పేద రోగులకు ఉచితంగా సేవలు దక్కుతాయన్నారు. ఇఎంజి పరీక్ష ఖరీదు సాధారణంగా రూ.5 వేలు వరకు ఉంటుందని, అయితే, కెజిహెచ్‌లోని ఈ నూతన సౌకర్యాన్ని పేద రోగులకు ఉచితంగా అందిస్తామని అధికారులు తెలిపారు. ఈ సౌకర్యం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు మెరుగైన నాడీ వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కెవిఎస్ఎం.సంధ్యా దేవి పాల్గొన్నారు. వారు నూతన యంత్రం ఆవశ్యకతను, దాని వల్ల రోగులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. కెజిహెచ్ అడ్మినిస్ట్రేటర్ బివి.రమణ, సిఎస్ఆర్ ఎంఓ డాక్టర్ యు.శ్రీహరి, ఆర్ఎంఓ డాక్టర్ ఎ.రాజేష్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ బి.కిరణ్ కుమార్, న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎస్.గోపి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.సతీష్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ సిహెచ్.సుష్మ, డాక్టర్ కె.మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

ఇఎంజి యంత్రం ప్రాముఖ్యత

ఇఎంజి కండరాలు, వాటిని నియంత్రించే నాడీ కణాల (మోటార్ న్యూరాన్స్) ఆరోగ్యాన్ని అంచనా వేయడానికి ఉపయోగించే ఒక ముఖ్యమైన పరీక్ష. ఈ కొత్త యంత్రం వేగవంతమైన, మరింత కచ్చితమైన రోగ నిర్ధారణకు సహాయపడుతుంది. ఇది నాడీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న రోగుల చికిత్సలో కీలకమైన పురోగతి. ఈ నూతన పరికరం కెజిహెచ్ న్యూరాలజీ విభాగం వైద్య సేవలను మరింత విస్తృతం చేయనుందని న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎస్.గోపి తెలిపారు.

నేడు వెదురు పెంపకంపై శిక్షణ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : అడ్డతీగల వైటీసీలో రాజవొమ్మంగి, అడ్డతీగల, వై.రామవరం మండలాల వారికి వెదురు పెంపకంపై శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని స్థానిక ఎంపిడిఓ లోకుల యాదగిరేశ్వరావు తెలిపారు. శిక్షణలో భాగంగా రాజవొమ్మంగి మండలంలోని 15 పంచాయతీల్లో 34 గ్రామాల నుండి సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, పీసా కమిటీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శి, వివో ప్రెసిడెంట్, ఎస్‌హెచ్‌జి లీడర్, ఫారెస్ట్ కమిటీ మెంబర్ హాజరు కావాలని ఆయన కోరారు.

ఫలించిన సిపిఎం పోరాటం

గోళ్ళగట్టలో కరెంటు స్తంభాల ఏర్పాటు

ప్రజాశక్తి-ఎటపాక : మండలంలోని గోళ్ళగట్టలో కరెంటు స్తంభాలు ఏర్పాటు చేయాలంటూ సిపిఎం నాయకులు చేసిన పోరాటం ఫలించింది. గుండాల పంచాయతీ గోళ్ళగట్ట గ్రామంలో తక్కువ ఎత్తులో విద్యుత్ తీగల ఉండటంతో వాటిని ఎత్తు పెంచాలని గత కొంతకాలంగా అధికారులకు తెలిపిన సమస్య పరిష్కారం కాలేదు. దీంతో సిపిఎం నాయకులు బుద్దుల భద్రయ్య, పెనుబల్లి భీష్మరావు, పెనుబల్లి ఏడుకొండలు, కల్లూరి వెంకట్రావు తదితరులు బుధవారం చింతూరు ఐటీడీఏ గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందించారు. దీంతో స్పందించిన అధికారులు శుక్రవారం నాడు కొత్త స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్తులైన ఎత్తు పెంచారు. దీంతో గ్రామస్తులు సమస్య పరిష్కారం కోసం చొరవ చూపిన సిపిఎం నాయకులను అభినందిస్తూ, స్పందించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

స్తంభాలు వేస్తున్న సిబ్బంది

చట్టాలపై అవగాహన అవసరం

మాట్లాడుతున్న జడ్జి భరణి

ప్రజాశక్తి-చింతపల్లి: చింతపల్లి ఐసిడీఎస్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ జడ్జి డి.శ్రీ భరణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సమాజంలో మహిళలు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నందున చట్టాలపై అవగాహన ఉండాలని సూచించారు. లైంగిక వేధింపులు, గృహ హింస, వరకట్న వేధింపులు వంటి సమస్యలు ఎదురైనప్పుడు కోర్టులు, చట్టాలు రక్షణ కల్పిస్తాయని గుర్తు చేశారు. ఏ సమస్య వచ్చినా తక్షణమే సమీప పోలీస్ స్టేషన్ లేదా స్థానిక కోర్టును సంప్రదించి ఫిర్యాదు చేయాలని సూచించారు. బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

పిల్లలకు తల్లిదండ్రులు గౌరవం, నైతిక విలువలు నేర్పించాలన్నారు. విద్యతో పాటు మంచి లక్ష్యాలను ఏర్పరచుకుని యువత ముందుకు సాగాలని ఆమె సూచించారు. గృహ హింస, భార్యాభర్తల వివాదాలలో హింసకు పాల్పడిన వారు చట్టపరమైన శిక్షలకు గురవుతారని స్పష్టం చేశారు. వరకట్నం ఇవ్వడం, తీసుకోవడం రెండూ కూడా నేరమని, డొమెస్టిక్ వైలెన్స్, పోక్సో వంటి చట్టాలపై మహిళలు అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడీఎస్ ప్రాజెక్ట్ సూపర్వైజర్ సౌజన్య, డి.జయభారతి, న్యాయవాదులు రావాడ సత్యనారాయణ, ఎన్.నూకరాజు, చింతపల్లి ఎస్సై వి.వెంకటేశ్వర్లు, ఎక్సైజ్ ఎస్సై రాంబాబు, విద్యా ఎస్సై సురేష్, పారా లీగల్ వాలంటీర్లు పనసల చిట్టిబాబు, కృష్ణ, కోర్టు సిబ్బంది, ఐసిడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌లో 37 వినతులు స్వీకరణ

వినతులు స్వీకరిస్తున్న దొన్నుదొర

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం రీజినల్ బోర్డు చైర్మన్, అరకు ఇంచార్జి సియ్యారి దొన్నుదొర ఆధ్వర్యంలో అరకులోయ మండల కేంద్రంలోని తమ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో ప్రజల నుంచి 37 వినతులు అందాయి. వీటిలో తాగునీటి సమస్య, సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, బ్రిడ్జి నిర్మాణం వంటి వాటిపై అధికంగా వచ్చాయి. ఈ సందర్భంగా దొన్నుదొర ప్రతి వినతిని సంబంధిత శాఖలకు పంపించి, త్వరిత గతిన పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ప్రజలతో మమేకమై సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డుంబ్రిగూడ మండల అధ్యక్షులు కిల్లో ఆనందరావు, అరకులోయ పిఎసిఎస్ చైర్మన్ పెట్టేలి రాము, అనంతగిరి మండల అధ్యక్షులు సోవేరి సుబ్బారావు, హుకుంపేట మండల అధ్యక్షులు శతక బొంజుబాబు, ప్రధాన కార్యదర్శి బొడ్డ శ్యామ్ సుందర్, ఉపాధ్యక్షులు లకే నాగేశ్వరరావు, మజ్జి భీమరాజు, బొర్రా సర్పంచ్ జన్ని అప్పారావు, క్లస్టర్ ఇన్చార్జి పాంగి సందీప్, సిరాగం గ్రామ కమిటీ అధ్యక్షులు మాణిక్యం, చొంపి గ్రామ కమిటీ అధ్యక్షులు గుండు బాబు, రామకృష్ణ, వెంకటరావు, గ్రామ కమిటీల అధ్యక్షులు పాడి నాగేశ్వర రావు, నర్సింగ్, భగత్‌రామ్, బాలరాజు, క్లస్టర్ ఇన్చార్జి కిల్లో మోహన్ దాస్ పాల్గొన్నారు.

వినతిపత్రం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

ప్రజా దర్బార్‌తో సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమ నిర్వహించడం జరుగుతుందని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని పలువురు సమస్యలతో కూడిన వినతులను ఎమ్మెల్యేకు అందజేశారు. వాటికి సంబంధించిన అధికారులతో మాట్లాడి పరిష్కరించేలా చర్యలు చేపట్టారు. మిగతా సమస్యలు అర్జీలను పరిశీలించి త్వరితగతిన వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ గొల్లపూడి పెద్దిరాజు, ఏఎంసీ చైర్మన్ లోతా లక్ష్మణరావు, స్థానిక సర్పంచ్ గొల్లపూడి రమణి, సొసైటీ అధ్యక్షులు ముప్పన కేశవ్, మాజీ సొసైటీ అధ్యక్షులు గనజాల తాతారావ్, తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు ముప్పన సావిత్రి, తెలుగు యువత మండల అధ్యక్షులు బి అనుదీప్, కూటమి నేతలు బి త్రిమూర్తులు, వి.గంగాధర్, ఎంపీటీసీ నల్లా సత్యనారాయణ, పాల్గొన్నారు.

జియో ట్యాగింగ్ నిర్వహిస్తున్న అధికారులు

గృహాలకు జియో ట్యాగింగ్

ప్రజాశక్తి-జికె.వీధి : మండలంలోని రింతాడ పంచాయతీ పరిధిలో నూతనంగా మంజూరైన గృహాలకు గహ నిర్మాణ శాఖ అధికారులు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం జియోట్యాగింగ్ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు సాగిన బ్రహ్మాజీ పడాల్, సాగిన భీమేశ్వర్ పడాల్, పంచాయతీ విఆర్ఓ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పెదవలసలో 'రైతన్నా.. మీకోసం'

ప్రజాశక్తి-జికె.వీధి : మండలంలోని పెదవలస గ్రామంలో టీడీపీ మండలాధ్యక్షులు పొత్తూరు కొండలరావు ఆధ్వర్యంలో రైతన్న మీకోసం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఎకరాకు నీరందించే దిశగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. డిమాండ్ ఆధారిత పంటలు పండించాలన్నారు.

సమాజంలో మారుతున్న ఆహారపు అలవాట్లకు అనుగుణంగా అన్నదాతలు సాగు పద్ధతులు మార్చుకోవాలని సూచించారు. సాగుకు టెక్నాలజీ తోడైతే ఇక మన రైతులకు తిరుగు ఉండదన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల ఉపాధ్యక్షులు పాడి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ సప్పగడ్డ ఆనందరావు, గంట నలిని, ఏఎంసి డైరెక్టర్, నాయకులు మొట్టడం శరభన్నదొర, దేశగిరి గోవిందరావు, దేశగిరి గంగాధర్, పంద్ర నూకరాజు, శెట్టి రామారావు, కంకిపాటి గిరిబాబు, బుజ్జిబాబు, రామకృష్ణ, మహేష్, గడుతూరి ఈశ్వరరావు, కంకిపాటి శ్రీనివాసరావు, గబులంగి నాగేష్, కంకిపాటి గోపాల్ పాల్గొన్నారు.